# ఒక్కరే ముద్దు

## -ఇచ్ఛాపురపు రామచంద్రం

పరధ్యానంగా నడుస్తున్న ఆ పెద్దాయన- "రామనాథం!" అన్న పిలుపు విని ఆగి చూసాడు. చక్రధరం.

గబగబా అతనివైపు నడిచి "నేను బయలుదేరింది నీకోసమే. రోడ్డుమీద జనాన్నీ, రద్దిని చూసేసరికి చిరాకొచ్చేసింది. నువ్వెక్కడికి వెళ్తున్నావు?" అడిగాడు.

"నీకోసమే" నవ్వాడు చక్రధరం.

ఇద్దరూ అపరాధభావంతో బాధపడుతున్నారు. ఔను... వాళ్ళు కలుసుకుని వారం దాటిపోయింది మరి. "అలా ఉన్నావేం? ఆరోగ్యం బాగానే ఉందికదా? ఇంట్లో అంతా క్షేమమేనా?" చక్రధరం, రామనాథం చేయి అందుకుని ఆప్యాయంగా అడిగాడు.

"క్షేమమే" నీరసంగా అన్నాడతను.

"మీ అమ్మాయి పెళ్ళి ఎంతవరకు వచ్చింది?"

"పీకలవరకు"

"రామనాథం! ఏమైంది?" ఆత్రంగా అడిగాడు చక్రధరం.

"అది చెప్పుకుందామని నీ దగ్గరికి బయలుదేరాను. నాకు నీకంటే మిత్రులూ, ఆప్తులు, ఆత్మీయులు ఎవరున్నారు?"

"నాకూ ఆంతరంగికుడివి నువ్వొక్కడివేగా. పద అలా పార్కుకి పోయి కూర్చుందాం" అంటూ దారి తీసాడు చక్రధరం.

వీళ్ళిద్దరూ ఒకే శాఖలో పనిచేసి ఒకే తేదీన రిటైరయ్యారు రెండేళ్ళక్రిందట. ఇద్దరూ మధ్యతరగతి వారూ, మంచి స్నేహితులు. రామనాథానికి ఇద్దరు ఆడపిల్లలు. రెండో అమ్మాయి పెళ్ళే ప్రస్తుతాంశం. చక్రధరానికి ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. అమ్మాయికి ఎనిమిదేళ్ళక్రితమే పెళ్ళిచేసాడు. అబ్బాయికి ఏడాది క్రిందటే ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం స్థిరపడిందని, చక్రధరం కొడుక్కి పెళ్ళి చేయాలని ఆ ప్రయత్నంలో వున్నాడు.

ఇద్దరూ పార్కుకి వెళ్ళి కూర్చున్నారు. పూలమొక్కలుకానీ, లాన్‌లుకానీ, బెంచీలుకానీ ఏమీ ఉండని ఖాళీ స్థలం అది. 'పార్కంటే పార్కు కాదు' అని పాడుకోవచ్చు. చుట్టూ గోడలు, విరిగిపోయిన గేటు, దానిపైన చెరిగిపోయిన అక్షరాలలో 'పార్కు' అని ఉన్న బోర్డు. జోళ్లు విప్పి కూర్చున్నారు ఒకరికొకరు ఎదురెదురుగా.

"చిన్నదానికి పెళ్ళి చేసేస్తే వొడ్డున పడతాను కదా అని ఎన్నాళ్లనుంచో అనుకుంటున్నాను" అలా మొదలుపెట్టాడు రామనాథం.

"ఔను" ఏదో ఒకటి అనాలి కదాని అన్నట్లు అన్నాడు చక్రధరం.

"ఈ రోజుల్లో వరుణ్ని వెతకడమంటే కష్టమైన పని మరోటి ఉండదు"

"నిజమే"

"భగీరథ ప్రయత్నం చేసాక ఎలా ఐతేనేం మంచి సంబంధం దొరికింది"

"పోనీలే అదృష్టవంతుడివి. ఆలస్యంగానైనా తెరిపిన పడుతున్నావు. పెళ్లెప్పుడు?" అభినందిస్తూ అడిగాడు చక్రధరం.

అతని మాటలు వినిపించుకోనట్టే "అమ్మాయి నచ్చిందని, అతని ఉద్యోగాన్నిబట్టి మరీ ఎక్కువ కాదని మంచి సంబంధమని కాలం అలా వుందని, మూడులక్షల కట్నం నా ప్రాణానికి చాలా ఎక్కువని అనిపించినా ఒప్పేసుకుని ముహూర్తం పెట్టించేసాను"

"మంచి పనిచేసావు. ఆలస్యం అమృతం విషం శుభస్య శీఘ్రం"

"నిశ్చితార్థానికి శని దిగబడ్డాడు"

"ఎవరు?" ఉలిక్కిపడి అడిగాడు.

"పెద్దల్లుడు" రామనాథం కంఠం నిండా కసి, కోపం.

"దశమగ్రహం కదా. వచ్చి?"

"ఈ పెళ్లి జరగాలంటే తనకి రెండులక్షలు ఇవ్వాలన్నాడు"

చక్రధరం నిర్ఘాంతపోయాడు.

"ఏమిటి నువ్వనేది? తెచ్చుకునేది రెండో అల్లుడైనతే పెద్దల్లుడికి ఎందుకు అంత డబ్బు ఇవ్వడం? ఆడపడుచు కట్నం, అత్తగారి కట్నం విన్నాంకానీ అల్లుడి కట్నం అని ఎప్పుడూ ఎక్కడా వినలేదే. తుంటి కొడితే పళ్ళు రాలాయని, చిన్నామ్మాయి పెళ్లికి పెద్దల్లుడికి కట్నం ఎందుకు ఇవ్వాలని అడగలేదా నువ్వు?"

"అడగకుండా ఎందుకుంటాను? అడిగాను"

"ఆ అల్లుడి కట్నం... అదే రౌడీమామూలుకి ఏం వివరణ ఇచ్చాడు? ఎలా సమర్థించుకున్నాడు?" కుతూహలంగా చూసాడు.

"నా పెళ్లికి మీరు లక్ష ఇచ్చారు అన్నాడతను పాయింట్ తీస్తున్నట్లు"

"ఐతే?" ఆశ్చర్యంగా చూసాను.

"ఇప్పుడేమో రెండో అల్లుడికి మూడులక్షలిస్తున్నారు. అంటే నాకు రెండులక్షలు తక్కువ చేసారనే కదా? అదే అడుగుతున్నాను అన్నాడు చల్లగా"

నాకు నోటివెంట మాట పెగలలేదు. కొంతసేపటికి తేరుకున్నాను.

"ఇది న్యాయం కాదల్లుడూ అన్నాను బ్రతిమాలుతున్నట్లు. పిల్లనిచ్చుకున్నవాడిని. ఆడపిల్లల తండ్రిని. మరెవరి ముందయినా ఎంతయినా అధికుడిని కావచ్చుగానీ అల్లుడి ముందు అణిగి ఉండవలసిందే అమ్మాయి క్షేమం కోరుకునేవాడైతే. అలాంటి తండ్రికి ఆడపిల్ల ఒక బలహీనతే"

"నేను న్యాయమే కోరుతున్నాను. ఇద్దరమ్మాయిలని సమానంగా చూడమనే నేను అడుగుతున్నాను బింకంగా అన్నాడు అల్లుడు. నేను పెద్దమ్మాయివైపు చూసాను రక్షించమన్నట్లు. అది ముఖం తిప్పేసుకుంది" ఒకసారి ఆగాడు రామనాథం. చక్రధరం నవ్వాడు.

"ఆడపిల్ల. పెళ్లయ్యాక అక్కడి పిల్ల. నీపక్షం వస్తుందనుకోవడం పేరాశే. అదీకాక డబ్బెవరికి చేదు?"

"తేరగా వచ్చే డబ్బు మరింత తీపి. నేను ఏం చేయాలో తోచక వెర్రిముఖం వేసుకుని నిలబడ్డాను. అల్లుడు అడిగిన రెండులక్షలు నీ నెత్తిమీద ఊహించని పిడుగు మరి"

"మాట్లాడరేం?" రెట్టించాడు అల్లుడు.

"ఏం మాట్లాడేది?" నీరసంగా నిస్పృహగా అన్నాను.

"సరే. నేను మాట్లాడతాను. జాగ్రత్తగా వినండి హెచ్చరిస్తున్నట్లే అన్నాడు అల్లుడు. నేను గుండెలు బిగపట్టుకుని తలవొంచుకున్నాను అతడేం చెప్పబోతున్నాడో అని వణికిపోతూ" చెప్పడం ఆపాడు రామనాథం.

"ఎందుకంత భయం? పైసా ఇవ్వను. ఏం చేస్తావో చేసుకో. ఎనిమిదేళ్లక్రితం కదా చేసావు దాని పెళ్లి? ఇంకా అల్లుడంటే భయమేనా?" విను

క్కున్నాడు చక్రధరం.

రామనాథం అతని మాటలు వినిపించుకోలేదు.

"మీరు చిన్నల్లుడికి కట్నంతోపాటే లేదా అంతకుముందుగానే నాకు రెండులక్షలు ఇవ్వకపోయారో మీ అమ్మాయిని తక్షణం పుట్టింటికి పంపేస్తాను. పెళ్లాన్ని వదిలేసానని, నలుగురికీ ముఖ్యంగా మీ రెండో అమ్మాయికి కాబోయే అత్తగారికి తెలియజేస్తాను. దానితో దాని పెళ్లి ఆగిపోతుంది. పెద్దామ్మాయి మొగుడిచేత వదిలివేయబడిందంటే చిన్నమ్మాయిని ఎవరూ చేసుకోరు బెదిరించాడు అల్లుడు"

"ఆఁ..." గతుక్కుంది నా గుండె.

అల్లుళ్లు కఠినులని తెలుసుగానీ ఇంత దుర్మార్గులనుకోలేదు. ఎంతకి తెగించాడు? ఎనిమిదేళ్ళు కాపురం చేసినదానిని ఏమీకానట్టే వదిలేస్తానంటున్నాడు. ఎలాగో నోరు విప్పాను.

"అది అన్యాయం, దారుణం. ఎనిమిదేళ్లక్రిందట డబ్బుకి విలువెక్కువ. అప్పట్లో లక్ష ఇప్పటి మూడులక్షలకంటే కూడా ఎక్కువే. అది అలా వుంచినా ఆనాటి లక్షకి వడ్డీకి తిప్పితే రెండురూపాయల వడ్డీకి నాలుగురెట్లుపైన అవుతుంది"

"అవును. మీరీ రెండులక్షలూ అప్పుడే ఇచ్చివుంటే ఎనిమిదిలక్షలపైనే అయి ఉండేవి. ఐతే ఎనిమిది లక్షలు ఇవ్వండి. మరీ సంతోషం" వేళాకోళం చేస్తున్నట్లు అన్నాడు అల్లుడు.

నాకు వొళ్లంతా చెమట్లు పోసేసింది. హార్ట్ ఎటాక్ వచ్చిందేమో అనిపించింది.

మళ్లీ అతనే అన్నాడు "పోనీలే మామగారూ! ఆడపిల్లల తండ్రివనే మానవతా దృక్పథంతో సహాయం చేయబోతే మీరే కాదంటున్నారు. కాలదన్నుకుంటున్నారు. సరే మీ అమ్మాయి కాపురం నిలబడాలంటే ఆరులక్షలివ్వండి. మీ మాట కాదనను"

నా కళ్ళు చీకట్లు కమ్మాయి. భూమి గిర్రున తిరుగుతున్నట్లయింది.

"బాబూ...రెండు లక్షలతో ఆగు. అదే పుణ్యం. కాళ్లు పట్టుకునే వుంటాను. జ్ఞాపకంలేదు"కొంతసేపు బతిమాలించుకుని ఎలాగో కనికరించాడు. బతుకుజీవుడా అనుకున్నాను.

మిత్రుడి మీద ఎంతో జాలేసింది చక్రధరానికి.

నాలుగేళ్ల క్రిందట రిటైరయ్యేవరకూ రామనాథం ఎలా బ్రతికాడని? ఆఫీసులో 'పులి' అనేవారు. అలా అని అతను దుష్టుడు, దుర్మార్గుడు ఏమీకాడు. రూలంటే రూలే అనేవాడు. తప్పులేనిదే ఆఫీసరు ముందు కూడా తలవొంచేవాడు కాదు. అలాగని లంచం అంగీకరించేవాడు కాడు. సాధ్యమైనంతమేరకు ఎదుటివాడికి మంచే చేసేవాడు. ఏదేమైనా యదార్థవాది లోకవిరోధి కదా. అందుచేత చాలామంది అతనికి దూరంగా ఉండేవారు. దానివల్ల అతనికి పోయింది ఏమీలేదు. అలాగే తలెత్తుకునే రిటైరయ్యాడు. అలాంటి రామనాథం ఇలా అనవలసి వచ్చిందా? అతని తప్పు అంటూ వుంటే ఆడపిల్లల్ని కనడం, వీళ్లకి పెళ్లి చేయడమా?

"ఈ ప్రపంచంలో ఎవరిముందు తలవొంచవలసిన అవసరం రాకుండా బతకాలంటే వాడికి ఆడపిల్ల ఉండకూడదు. ఆడపిల్ల ఉంటే దేవుడైనా సరే అల్లుడి కాళ్ళు పట్టుకోవాల్సిందే! కన్యాదానమప్పుడే కాదు, జీవితం కడదాకా అల్లుడి పాదాలు కడుగుతూ ఉండవలసిందే. అల్లుడయ్యేసరికి గడ్డిపోచ కాస్తా గునపమవుతుంది మామ ముందు. ఏకు అల్లుడయిందో మేకు అయిందన్నమాటే. ఎవరి వ్యక్తిత్వమైనా అల్లుడు వచ్చేవరకే" నిర్వేదంగా అన్నాడు రామనాథం.



"ఇంతకీ ఏం చేసావు?" జాలిగా అడిగాడు చక్రధరం.

"చేయడానికి మరో మార్గమంటూ ఉంటేకదా? ఏం చేస్తాను? చచ్చినట్లు పెద్దల్లుడికి రౌడీమామూలు చెల్లించుకున్నాను. చెప్పుకుంటే సిగ్గుచేటు"

"గోరుచుట్టుమీద రోకటి పోటు అంటే ఇదేనేమో! రెండో అల్లుడికి వర కట్నం, పెద్దల్లుడికి రౌడీమామూలు. బాగుంది. ఏమిటో నాగరికత అభివృద్ధి చెందేస్తుందంటారు. విద్యావంతుల శాతం పెరిగిపోతోందంటారు. కానీ మనం మనుషులం ఇంకా వరకట్నం నుంచి పైకి ఎదగలేకపోతున్నాం" చక్రధరం సానుభూతిగా రామనాధం చేయి పట్టుకున్నాడు.

"ఇల్లు అమ్మకానికి పెట్టాను. ఐదులక్షలొస్తే అమ్మేస్తాను. ఎవరికేనా కావా లంటే చెప్పు"

'అయ్యో' అనిపించింది చక్రధరానికి. రామనాధం ఆ ఇంటిని ఎంత కష్ట పడి ముచ్చటపడి కట్టించుకున్నాడో అతనికి తెల్సు. అతనికి హఠాత్తుగా ఏదో ఆలోచన వచ్చింది.



## భయమెందుకు?

ఎప్పుడూ షూటింగ్‌లేనా? అంటోంది అందాలభామ రియాసేన్. మునుప టికంటే బొద్దుగా, ముద్దుగా తయారైన ఈ జవ్వని ఫ్రెండ్స్‌తో కలిసి తిర గడం అంటే తనకెంతో ఇష్టం అంటోంది. అందుకే షూటింగ్స్ లేని టైంలో ఎవ్వరితో చెప్పకుండా ఫ్రెండ్స్ ఇంటికి చెక్కేసి వారిని సర్‌ప్రైజ్ చేస్తుంటుం దిట. బాయ్‌ఫ్రెండ్స్ అంత అవసరమా అని అడుగుతున్న రియా మీడి యాని చూస్తే మాత్రం తనకి భయం అంటోంది.




"ఔను...ఒకవేళ రెండో అల్లుడు కట్నం కోరనివాడనుకో. అప్పుడు మీ పెద్దల్లుడు తాను ఆనాడు తీసుకున్న లక్ష వాపసు ఇచ్చేస్తాడా?" అని అడి గాడు.

రామనాధం అదోలా నవ్వాడు.

"నువ్వు అలా మాట్లాడుతున్నావుగానీ రాజు తప్పు చేయడు అన్నట్లే అల్లుడు మామకి ఏం చెప్పినా అదే న్యాయము, ధర్మమూ అన్నీ. నిజంగా జామాతా దశమగ్రహమే. సుమతీ శతక కర్త చెప్పినట్లు అల్లుని మంచితనం తెల్లకాకే. మామ అల్లుడిని ఎదురు ప్రశ్నవేస్తే తన కూతురి కాపురంలో చేజే తులా నిప్పులు పోయడమే. సరేలే. ఇల్లు అమ్మేస్తే అద్దె ఇంట్లో వుంటాను. పెన్ష న్‌లోనే కుదించుకుని బతుకుతాను"

ఒక నిముషంపాటు ఇద్దరూ మౌనంగా ఉండిపోయారు.

"నీకు ఇలాంటి బాధలు వుండవులే. అమ్మాయి పెద్దదీ, అబ్బాయి చిన్న వాడు కదా. ఒక్కతే అమ్మాయి. ఇద్దరమ్మాయిలు అయితేనే చిక్కు" అన్నాడు రామనాధం.

చక్రధరం భారంగా నవ్వాడు. వేదాంతిలా వెర్రినవ్వు నవ్వాడు.

"నువ్వు ఏదోలా ఉన్నావేంటి? ఇంట్లో అంతా క్షేమమేనా? ఈ వారం పదిరో జులుగా పెళ్లి సంబంధం హడావుడిలో పడి నిన్ను కలుసుకోలేకపోయాను. క్షమించి ఏం జరిగిందో చెప్పు. నీకు విచారమేమిటి? ఎందుకు?"

"కష్టమూ, సుఖమూ చెప్పుకునేందుకు నాకు నీకంటే ఎవరున్నారు? నన్ను అర్ధం చేసుకోగలిగేవాడవు నువ్వే"

"నాకూ అంతేకదా. పనుల హడావిడివల్ల కాకపోతే ఇన్నాళ్ళు మనం కలు సుకోకుండా ఉన్నామా ఎప్పుడైనా? చెప్పు చక్రం..నీకేం సమస్య వచ్చింది?" ఆశ్చర్యంగా చూసాడు.

"జీవితాన్ని వీలైనంత సుఖంగా మలుచుకునేందుకు అందరిలాగే మనమూ ప్రయత్నించాం. మన రోజుల్లో కుటుంబ నియంత్రణకి ప్రచారం అట్టే ఉండేదికాదు"

"ఔను అక్కడక్కడ 'ఇద్దరు లేక ముగ్గురు' అని కనిపించేది"

"అయినా మనం ఇద్దరితోనే ఆపేశాం పిల్లలకీ మనకీ సుఖమని"

"నిజమే. అందులోనూ మనకి సంతానం ఆలస్యం కూడానూ"

"అందుచేత మనం భవిష్యత్తుకోసం జాగ్రత్తపడ్డాం కనుక సుఖంగా జీవితం వెళ్ళుందనుకున్నాం. కానీ ఏదీ?"

"ఏమైంది?" అయోమయంగా చూసాడు రామనాధం.

"ఇద్దరమ్మాయిలు అయితేనే చిక్కు అన్నావు. కానీ ఇద్దరు పిల్లలని కంటే వీళ్లెవరైనా చిక్కే అంటుంది నా జీవితానుభవం"

"అంటే?"

"ఈ పదిరోజులూ నువ్వు మీ అమ్మాయి పెళ్లి సంబంధంతో బిజీగా ఉన్నట్లే నేనూ మా అబ్బాయి పెళ్లి సంబంధంతో బిజీ అయ్యాను. మంచి సంబంధమే. అమ్మాయి మావాడికి నచ్చింది"

"ఇంకేం?"

"నీకు తెలుసు. నేను వరకట్నం వ్యతిరేకినని"

"కానీ ఎనిమిదేళ్లక్రిందట మీ అమ్మాయికి పెళ్లి చేసినప్పుడు రెండులక్షలు ఇచ్చినట్టు ఉన్నావుకదా!"

"నిజమే. కట్నం ఇవ్వడమనేది ఆదర్శమే కావచ్చు. తనకి లాభసాటి మాటేనా కావచ్చు. కట్నం పుచ్చుకోను అంటే ఖచ్చితంగా ఆదర్శమే. అలా అనే అవకాశం వచ్చేది అబ్బాయి విషయంలోనే కదా?"

"అవును"

"అందుకే అమ్మాయి పెళ్లికి కట్నమిచ్చినా, అబ్బాయి పెళ్లికి తీసుకోకూడ దనుకున్నాను. నిన్న ఉదయం అబ్బాయికి పెళ్లిచూపులు జరిగాయి. మనవి చిన్న కుటుంబాలు. అదీకాక అల్లుడు మన దృష్టిలో మన కుటుంబ సభ్యుడు.

అందుచేత అమ్మాయినీ, అల్లుడ్నీ వెంటబెట్టుకునే వెళ్లాం చూపులకి. అమ్మాయి నచ్చినట్లు అప్పటికప్పుడే చెప్పేసాం. అంతా అయ్యాక అమ్మాయి తండ్రి 'నేనివ్వగలిగింది మూడులక్షలు. ఆపైన నాకు స్థోమతలేదు. ఏవయినా అంటే కట్నం, లాంఛనాలు... అన్నిటికీ కలిపి మూడులక్షల యాభై వేలివ్వ గలం. పెళ్లి బాగా జరిపిస్తాం' అన్నాడు తొందరపడిపోయి''

నేను నవ్వాను. "మేం కట్నం తీసుకోం'''

"ఆఁ'' త్రుళ్లిపడ్డాడు అమ్మాయి తండ్రి. 'వద్దు వద్దు. కట్నం వొద్దనవద్దు. లాంఛనాలనీ, అవనీ ఇంతకు అంత అడుగుతారు. మా అన్నయ్య వాళ్ల మ్మాయి పెళ్లి కట్నం లేకుండా చేసి కుదేలైపోయాడు. మీరు తీసుకున్నా మానినా మేమిచ్చేస్తాం'. కట్నం లేని పెళ్లనేసరికి ఆయన ఎంత భయపడిపో యాడో!''

"కట్నం తీసుకోలేదని, కానుకలూ, లాంఛనాలూ కోరం. మేము అలాంటి వాళ్లం కాము అని ఎలాగో వాళ్లని నమ్మించగలిగాను''

"నిజమే. ఈ రోజుల్లో కట్నం తీసుకోనివాళ్లంటే అనుమానించదగిన వాళ్ల యిపోయారు. వందమందిలో ఒక్కడు మంచివాడున్నా ప్రజలు అతన్నీ అంద రిలోనే జమ వేసేస్తారుకదా. సరే ఇకనేం? నీ ఆదర్శం నెరవేరుతుందిగా? ఇంకెందుకు ముఖం అలా ఉంది?''

"అసలు కథ నిన్న రాత్రే.. అంటే ఇంటికొచ్చాకనే జరిగింది'' బాధగా అన్నాడు చక్రధరం.

"ఏమైంది?'' ఆత్రంగా అడిగాడు రామనాథం.

ఇంటికొచ్చి భోజనాలు అవీ చేసి కూర్చున్నాం. అందరమూ సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నాం. అప్పుడు మా అల్లుడు వచ్చాడు లోపలినుంచి''

"రా అల్లుడూ కూర్చో'' ఆహ్వానించాను.

"మీకొక విషయం చెప్పాలి'' అన్నాడు కూర్చుని.

"చెప్పు'' నవ్వుతూ అన్నాను.

"అక్కడ అడిగితే బాగుండదని ఊరుకున్నాను. వీళ్లిస్తామంటున్నా మూడు న్నర లక్షల కట్నం ఎందుకు కాలదన్నుకున్నారు?''

"కొడుకును కన్నదీ పెంచింది, ప్రయోజకుడ్ని చేసిందీ అమ్ముకునేందుకు కాదుకదా. వరకట్నానికి నేను వ్యతిరేకిని''

"సరే. అది మీ ఇష్టం. కానీ ప్రకాష్‌కి మూడున్నర లక్షలు విలువ నిర్ణయిం చారు వాళ్ళు. అది నేను అంగీకరిస్తాను. మీరు తీసుకోకకానీ లేకపోతే మీకు మూడున్నర లక్షలు వచ్చేవికదా''

"ఊ...'' అని మూలిగాను. అతనెందుకలా అడిగాడో ఊహించలేక.

"కానీ...మీరు నాకు ఇచ్చింది రెండులక్షలే. ఆనాటి నుంచి ఈనాటివరకు వడ్డీ లెక్క వేయను మీరు పైవారు కాదు కనుక. లక్షన్నర ముందు నాకిచ్చేసి అప్పుడు చేయండి మీ అబ్బాయి పెళ్లి'' అతని కంఠం కరుకుగా ధ్వనించింది.

"అల్లుడూ!'' ఆశ్చర్యమూ, బాధా పట్టలేక అరిచినంత పనిచేసాను.

చెప్పడానికి ఇంకేం లేదన్నట్లు, అదే తీర్పన్నట్లు చావు కబురు చల్లగా చెప్పేసి లేచిపోయాడు మితభాషి అయిన అల్లుడు. నేను తేరుకోలేకపో యాను. ఐనా రక్షించమన్నట్లు అమ్మాయివేపు చూసాను.

"ఆయన మాటంటే మాటే. నా కాపురం, ఈ పెళ్లి సజావుగా జరగాలంటే మీరు వారన్నట్లు ఇవ్వక తప్పదు. అంత డబ్బు అప్పనంగా వస్తుంటే అమాయ కులు కనుక మీరు వద్దన్నారుకానీ ఎవరూ సిరికి మోకాలొడ్డుతారు?'' అని సుశీల కూడా లేచి వెళ్లిపోయింది.

మూడు గ్లాసుల నీళ్లు అందించింది మా ఆవిడ. తాగినా స్థిమితపడలేకపో యాను. అవతలవాళ్లకి కట్నం తీసుకోనని ఖరాఖండిగా చెప్పాను. ఆ షరతు మీదే సంబంధం స్థిరం చేసుకుని ముహూర్తం కూడా అనేసాను. ఇప్పుడు పెళ్లి జరగాలంటే అల్లుడికి లక్షన్నర చెల్లించుకున్నాకే. ఇదీ నా పరిస్థితి. ముందు నుయ్యి వెనుక గొయ్యి రామనాథం. నా పరిస్థితికి నవ్వొస్తోందా? నేనొట్టి వెర్రివా డిని, చవటని, అమాయకుడ్ని, ఎందుకూ పనికిరానివాడిని. మగపిల్లాడి పెళ్లి చేయడానికి కూడా ఇల్లు అమ్ముకోవలసిన వెంగళప్పని. నా ఇంటిని ఎవరేనా నాలుగు లక్షలకు కొంటారేమో చూడు. మా అల్లుడికి రౌడీమామూలు చెల్లించి మా అబ్బాయికి పెళ్లి చేస్తాను''

నమ్మలేనట్లు చూసాడు రామనాథం.

ఒక్క నిముషంపాటు వాళ్లిద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసుకుంటూ ఉండిపోయి ఒక్కసారిగా జీవితం అర్థమైనట్లు ఫక్కున నవ్వేసారు.

"ఒక్కరే ముద్దు, ఇద్దరు వద్దు అని ఆనాడే ప్రభుత్వం చెప్పి వుంటే ఇవాళ మనకి ఈ పరిస్థితి రాకపోనేమో!''

"సర్లే...గతజల సేతుబంధనంవల్ల ప్రయోజనమేముంది? బ్రోకరు దగ్గరకు పద. మన ఇళ్లు అమ్ముతామని బేరం చూడమని చెబుదాం''

ఇద్దరూ లేచి పార్కులోంచి బయటకు నడవసాగారు.

★

## పాపం అత్తగారు

ఆంటోనియో బెడ్‌సెల్లి అనే వ్యక్తి సిసిలీదేశం పాలెర్మో నగరవాసి. శరీర రుగ్మతలు కారణంగా చనిపోయాడు. అయితే మామూలు కార్యక్రమాలు పూర్తి అయిన తర్వాత శవపేటికలో పెట్టి స్మశానానికి తరలించారు. గోతి లోకి పెట్టి దింపుతుండగా అతను గభాలున లేచి కూర్చున్నాడు. ఆ చచ్చి బ్రతికిన మనిషిని ఆ శవపేటికనూ సంతోషంగా ఇంటికి తీసుకెళ్లారు. పున ర్జన్మ ఎత్తిన అతన్ని చూసి అందరూ ఆనందిస్తూండగా అత్తగారు ఆ షాక్‌తో గుడ్లు తేలేసింది. శవం మార్పుతో ఆ శవపేటిక అల్లుడికి బదులు అత్తగారిని తీసుకువెళ్లింది స్మశానానికి.

## మహాపక్షి

కొన్ని జానపదగాథలలో పెద్దపక్షి రాజకుమారుడ్ని తన కాళ్ల మధ్యన ఇరికించుకుని కొన్ని వేల మైళ్ళ ప్రయాణం చేసినట్టు ప్రాచీన గాథాలహ రిలో మనం చదివాం. కానీ 80లక్షల సంవత్సరాలకు పూర్వం అంతపెద్ద మహాపక్షి ఉండేదని, దాదాపు 100కిలోల బరువు ఉండేదని తెలిసింది. అది తన రెక్కల్ని విప్పినప్పుడు 25 అడుగుల పైనే ఉండేదిట. ఇప్పటివ రకూ అమెరికాలోని పురావస్తు ప్రదర్శనశాలలో ఆ పక్షి అహోపాలు ఉన్నా యని చెప్పుకుంటారు.

-రమణ కుమార్

